క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

కందుకూరు: విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా మండల పరిధిలోని లేమూరు, గూడూరు విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిలో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ వేణుగోపాల్‌రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. లేమూరు సబ్ స్టేషన్ పరిధిలోని అగర్‌మియాగూడ, బైరాగిగూడ, మిర్చి ఫ్యాక్టరీ, నిషిత కళాశాల ప్రాంతం, గూడూరు సబ్ స్టేషన్ పరిధిలో గూడూరు, మాలగూడూరు, బండమీద గూడూరు, కటికపల్లి, అన్నోజిగూడ, తిమ్మాయిపల్లి గ్రామాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు, రైతులు సహకరించాలని కోరారు.

నేడు బాలాపూర్ సొసైటీ సర్వసభ్య సమావేశం

బడంగ్‌పేట్: బాలాపూర్‌లోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం లిమిటెడ్ బండ్లగూడ ఖాల్సా 50వ సర్వసభ్య సమావేశాన్ని మంగళవారం నిర్వహించనున్నట్లు సహకార సంఘం అధ్యక్షుడు సింగిరెడ్డి పెంటారెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో 2024–25 వార్షిక నివేదికను ఆమోదించుట, వార్షిక లాభ నష్టాలు, డిపాజిట్లు, ట్రిపుల్ ఎస్ రుణ ఖాతాలు, బంగారు రుణాలు, ఏడాది బడ్జెట్ రుణాలు తదితర అంశాలపై చర్చ ఉంటుందని చెప్పారు. పాలక మండలి సభ్యులు, ఖతాదారులు, పొదుపు సంఘాల సభ్యులు తప్పకుండా హాజరవ్వాలని కోరారు.

పండుగకు వెళ్లేవారు సూచనలు పాటించాలి

సరూర్‌నగర్ సీఐ సైదిరెడ్డి

హుడాకాంప్లెక్స్: దసరా సెలవులకు స్వగ్రామాలకు వెళ్లేవారు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సరూర్‌నగర్ సీఐ సైదిరెడ్డి ప్రజలకు సూచించారు. బంగారం, వెండి, నగదు వంటి వస్తువులు బ్యాంకు లాకర్లలో భద్రపరచుకోవాలని చెప్పారు. ఇళ్ల వద్ద సీసీ కెమెరాల పర్యవేక్షణ ఉండేలా చూసుకోవాలని కోరారు. బస్సుల్లో ప్రయాణ సమయంలో జాగ్రత్తలు పాటించాలని కోరారు. కాలనీల్లో అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులకు సూచించారు.

యూరియా పంపిణీ

కందుకూరు: మండల కేంద్రంతో పాటు రాచులూరులో సోమవారం రైతులకు యూరియా పంపిణీ చేశారు. కందుకూరు పీఏసీఎస్‌కు 450 బస్తాలు, రాచులూరుకు 450 బస్తాలు రాగా ఏఓ లావణ్య, సీఐ సీతారామ్ ఆధ్వర్యంలో టోకెన్ల వారీగా ఒక్కో రైతుకు రెండు బస్తాల చొప్పున అందజేశారు.

రుణాలు సకాలంలో చెల్లించాలి

పీఏసీఎస్ చైర్మన్ వెంకట్రామ్‌రెడ్డి



లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న వెంకట్రామ్‌రెడ్డి

కందుకూరు: సొసైటీ సేవలను సద్వినియోగం చేసుకుంటూ తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలని పీఏసీఎస్ చైర్మన్ ఎస్.వెంకట్రామ్ రెడ్డి కోరారు. మండల పరిధిలోని రాచులూరుకు చెందిన రైతులకు మంజూరైన ఎల్‌టీ రుణాలను సోమవారం ఆయన లబ్ధిదారులకు అందజేశారు. పద్మగౌడ్, ధనుంజయ్‌గౌడ్, ప్రవీణ్‌కు రూ.7 లక్షల చొప్పున మంజూరైన రుణాల చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సొసైటీ బలోపేతంతోనే రైతులకు అవసరమున్న సమయాల్లో సులభంగా రుణాలు ఇచ్చే వెసులుబాటు కలుగుతుందన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ ఎస్.పాండురంగారెడ్డి, సిబ్బంది మహేశ్, పర్వతాలు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న రాఘవేందర్‌రెడ్డి

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని 26వ డివిజన్‌లోని శ్రీహిల్స్ కాలనీలో అధికారులు సోమవారం సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏపీసీసీ కోఆర్డినేటర్ బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి హాజరై పనులు ప్రారంభించారు. సీసీ రోడ్డు నిర్మాణ పనులకు సహకారం అందించిన మాజీ మేయర్ చిగురింత పారిజాతకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో 5వ డివిజన్ ఇన్‌చార్జి ప్రతాప్‌రెడ్డి, శ్రీహిల్స్ కాలనీ అధ్యక్షుడు రమేష్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి రవీందర్‌నాయక్, కోశాధికారి ప్రభాకర్, వైస్ ప్రెసిడెంట్ వెంకటయ్య, ఆర్గనైజింగ్ కార్యదర్శి రాములు, సెక్రటరీ కిరణ్ కాలనీవాసులు సత్యనారాయణ తదితరులున్నారు.



పహాడీషరీఫ్: మామిడిపల్లి శివసేన యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..



మహేశ్వరం: చిన్నతూప్రలో..

దేవీ నవరాత్రులు షురూ

బాలాత్రిపుర సుందరీ దేవిగా అమ్మవారు

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా నియోజకవర్గ పరిధిలోని ఆలయాల్లో, అమ్మవారి మండపాల వద్ద తొలిరోజు ప్రత్యేక పూజలు చేశారు. పలుచోట్ల అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

– మహేశ్వరం జోన్ బృందం



మహేశ్వరం: మన్సాన్‌పల్లిలో..



మహేశ్వరం: శివగంగ రాజరాజేశ్వరాలయంలో బాలత్రిపుర సుందరి దేవిగా అమ్మవారు



మహేశ్వరం: అమీర్‌పేట్ గ్రామంలో..



తుక్కుగూడ: మంఖాల్ మహంకాళీ మాత



బడంగ్‌పేట్: వేణుగోపాల స్వామి ఆలయంలో ..



కందుకూరు: అగర్‌మియాగూడలో..



మీర్‌పేట: మీర్‌పేట పాత గ్రామంలో..

మహిళల ఆరోగ్యరక్షణకు వైద్య శిబిరాలు

డిప్యూటీ డీఎంహెచ్‌ఓ గీత

కందుకూరు: మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో స్వస్థ్ నారి స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ గీత ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళల ఆరోగ్య రక్షణకు శిబిరాలు ఉపయోగపడుతాయన్నారు. శిబిరంలో గైనకాలజిస్టు, జనరల్ మెడిసిన్ స్పెషలిస్టు, ఈఎన్‌టీ, చర్మవ్యాధి, మానసిక నిపుణులు పాల్గొని వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారిణి డాక్టర్ హుమేరాసుల్తానా, డాక్టర్ అఖిల, సీహెచ్‌ఓ రఫీక్, డిప్యూటీ పీఎంఓ సుదర్శన్, సూపర్‌వైజర్లు రఘు, శ్యామల, సిబ్బంది పాల్గొన్నారు.



కందుకూరు: శిబిరంలో పాల్గొన్న వైద్య బృందం

పనులు పూర్తయ్యేలా చూడండి

కందుకూరు: అభివృద్ధి పనులు వేగంగా జరిగేలా రాష్ట్ర ప్రభుత్వం కాంట్రాక్టర్లకు సకాలంలో బిల్లుల చెల్లింపులు చేపట్టాలని ఎమ్మెల్యే సబితారెడ్డి సూచించారు. గతంలో మండల పరిధిలోని కొలన్‌గూడ గేట్–కొలన్‌గూడ గ్రామం వరకు 1.30 కిలోమీటర్లకు గాను రూ.1.50 కోట్లు, కొలన్‌గూడ నుంచి చింతుల్ల క్రాస్ రోడ్డు వరకు కిలోమీటర్ మేర రహదారి మరమ్మతులకు రూ.25 లక్షల నిధులు మంజూరయ్యాయి. కాంట్రాక్టర్ తొమ్మిది నెలల క్రితం పనులు ప్రారంభించి నిధుల లేమితో మధ్యలో నిలిపివేశాడు. దీంతో గ్రామస్తులు ఇబ్బంది పడుతున్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సోమవారం ఆ రహదారిని పరిశీలించారు. డీఈ అనిల్‌కుమార్, ఏఈ సతీష్‌రెడ్డిని పిలిపించి వారితో మాట్లాడి సమస్య అడిగితెలుసుకున్నారు. త్వరగా పనులు పూర్తయ్యేలా చూడాలని ఆదేశించారు. ఆమె వెంట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎస్.సురేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఎం.జయేందర్‌ముదిరాజ్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు ఎస్.రాజశేఖర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ఎం.బాబు, నాయకులు లచ్చానాయక్, గణేశ్, బీరప్ప, శేఖర్‌గుప్తా, దీక్షిత్‌రెడ్డి, దేవీలాల్, దర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా ఆలయ బ్రహ్మోత్సవాలు

పహాడీషరీఫ్: మామిడిపల్లిలోని బాలాజీ వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ ప్రధాన అర్చకుడు సుధీర్ కుమార్ పర్యవేక్షణలో ఉదయం అభిషేకం, విష్వక్సేన పూజ, పుణ్యాహవచనము అంకురార్పణ పూజలు కొనసాగాయి. వారం రోజుల పాటు ఆలయంలో అన్నదాన కార్యక్రమ నిర్వహణకు గ్రామానికి చెందిన ఎడ్ల పండరీనాథ్ ధాతృత్వం వహిస్తున్నారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కళ్లెం నరేష్ గౌడ్, ఈఓ మురళీకృష్ణ, సభ్యులు చీమలదారి చెన్నయ్య, గొండ్యాల శేఖర్ ముదిరాజ్, ఎలిగపల్లి అనిత, కానుగుల భాస్కర్, గుర్జని రాధిక, కాంగ్రెస్ నాయకులు లాల్ సతీష్ గౌడ్ తదితరులు పూజలో పాల్గొన్నారు.



పూజల్లో పాల్గొన్న భక్తులు

ప్రజా సమస్యలపై ఉద్యమిస్తాం

సీపీఎం మండల కార్యదర్శి జంగయ్య



తాళ్లపల్లిగూడ పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

మంచాల: ప్రజాసమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించేందుకు ఉద్యమిస్తామని సీపీఎం మండల కార్యదర్శి రావుల జంగయ్య అన్నారు. సోమవారం పార్టీ ఆధ్వర్యంలో మండల పరిధిలోని తాళ్లపల్లిగూడలో పర్యటించి ప్రజా సమస్యలను తెలుసున్నారు. ఈ సందర్భంగా జంగయ్య మాట్లాడుతూ.. గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ పాడైందని దీంతో దుర్వాసన వెదజల్లుతోందన్నారు. రోడ్లు సరిగా లేక రాకపోకలు ఇబ్బందిగా మారిందన్నారు. అర్హులందరికీ పెన్షన్లు మంజూరు చేయలేదని గుర్తించామన్నారు. ఈ మేరకు గ్రామ సమస్యలపై పంచాయతీ కార్యదర్శి రాజలక్ష్మికి వినతిపత్రం అందజేశామని తెలిపారు. ప్రభుత్వం స్పందించి సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు మల్లేష్, నాగరాజు, శివ, సాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా బతుకమ్మ ఆటపాట



బతుకమ్మ ఆడుతున్న ఉపాధ్యాయినులు, విద్యార్థినులు

మీర్‌పేట: మీర్‌పేట సత్యం పాఠశాలలో సోమవారం దసరా, బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు, ఉపాధ్యాయినులు పూలను పేర్చి ఉత్సాహంగా బతుకమ్మ ఆడారు. అనంతరం ఉపాధ్యాయులు బతుకమ్మ పండుగ విశిష్ట, విజయదశమి పండుగ గురించి విద్యార్థులకు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక నృత్య ప్రదర్శన అందరిని ఆకట్టుకుంది. సంబురాలలో పాఠశాల డైరెక్టర్ దేవీ, ఎకనమిక్ డైరెక్టర్స్ తేజ, సిరి పాల్గొన్నారు.

సమతుల ఆహారంతోనే ఆరోగ్యం

పహాడీషరీఫ్: మహిళలు చక్కటి ఆరోగ్యం కోసం సమతుల్య ఆహారం తీసుకోవాలని జిమ్స్ హోమియోపతిక్ మెడికల్ కళాశాల, ఆస్పత్రి కమ్యూనిటీ మెడిసిన్ గైనకాలజీ విభాగం వైద్యురాలు డాక్టర్ రోజా సూచించారు. ఆస్పత్రి ఆధ్వర్యంలో సోమవారం మామిడిపల్లి రంగనాయకుల కాలనీలో మహిళలు, బాలికలకు పోషణ్ మహ్, స్వస్థ్ నారీ శసక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సంద్భంగా వారికి అవగాహన కల్పించడంతో పాటు వైద్య పరీక్షలు నిర్వహించారు. కౌమారదశలో ఉన్న బాలికలు, గర్భిణులు, బాలింతలు పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలన్నారు. రోగ నిరోధక శక్తి, పునరుత్పత్తి, జీవన నాణ్యతను పెంపొందించడంలో పోషక ఆహారం పాత్ర ఎంతో ఉందన్నారు. కార్యక్రమంలో జిమ్స్ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ విరాజ్ కుమార్, అంగన్‌వాడీ టీచర్ స్వరూప తదితరులు పాల్గొన్నారు.



మహిళలకు అవగాహన కల్పిస్తున్న వైద్యులు

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి

నాగోలు: అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని నాగోలు కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్ అన్నారు.సోమవారం నాగోలు డివిజన్ పరిధి హనుమాన్‌నగర్ కాలనీలో చేపట్టిన తాగు నీటి పైపులైన్ పనులకు శంకుస్థాపన చేసి మాట్లాడారు. కాలనీవాసులకు ఇబ్బందులు లేకుండా త్వరగా పనులు పూర్తి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జలమండలి మేనేజర్ అర్చన, బీజేపీ నాయకులు సిద్దాల అయిలయ్య,రావుల శ్రీనివాస్,కాలనీ వాసులు చంద్ర శేఖర్,పీఎస్ శర్మ,రాంరెడ్డి,రవీంద్రాచారి, వెంకటయ్య, కోటయ్య నాయుడు పాల్గొన్నారు.



అల్మాస్‌గూడ ముంపు ప్రాంతాల్లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి



బృందావన్‌కాలనీలో బాధితులతో మాట్లాడుతున్న అందెల

పనితీరులో మార్పులేకే సమస్యలు

- అధికారులపై మాజీ మంత్రి సబితారెడ్డి ఆగ్రహం
- అత్యవసర పరిస్థితుల్లో బీఆర్ఎస్ శ్రేణులు అందుబాటులో ఉండాలని పిలుపు

బడంగ్‌పేట్: వందరోజుల ప్రణాళికలో నాలాల శుభ్రత చేయకపోవడం వల్లే కాలనీలు ముంపునకు గురవుతున్నాయని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు. సోమవారం ఆమె బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అల్మాస్‌గూడలో ముంపునకు గురైన జయ శంకర్ కాలనీ, సాయిరాం కాలనీల్లో సందర్శించారు. ఇళ్లల్లోకి చేరిన వరద, మురుగును పరిశీలించి బాధితులతో మాట్లాడారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వంద రోజుల ప్రణాళిక సక్రమంగా అమలు చేయలేక పోవడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వాతావరణ శాఖ ఎప్పటికప్పుడు హెచ్చరిస్తున్న అధికారుల్లో మార్పు రాకపోవడంపై మండిపడ్డారు. అత్యవసర పరిస్థితి ఏర్పడితే ప్రజలకు అందుబాటులో ఉండాలని బీఆర్ఎస్ నాయకులకు పిలుపునిచ్చారు. కమిషనర్ సరస్వతితో ఫోన్‌లో మాట్లాడి సమస్య పరిష్కరించేలా చూడాలని ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ కార్పొరేషన్ అధ్యక్షుడు రాంరెడ్డి, నాయకులు కృష్ణ, రాంరెడ్డి, శేఖర్‌రెడ్డి తదితరులున్నారు.

ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం

కార్పొరేషన్ పరిధిలోని గుర్రంగూడ ముంపు ప్రాంతాల్లో సోమవారం రంగారెడ్డి జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల కన్వీనర్, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్ పర్యటించారు. సాయిదుర్గా కాలనీ, బృందావన్ కాలనీ, పంచాయతీరాజ్ కాలనీ, శ్రీనివాసపురం, తద్దం ఎన్‌క్లేవ్, ఆదిత్యనగర్ తదితర కాలనీలు ఆదివారం రాత్రి కురిసిన వర్షాలకు ముంపునకు గురయ్యాయి. వరద ముంపులోని ఇళ్లల్లో ఉన్న కాలనీవాసులతో, బాధితులతో మాట్లాడారు. ఈ సందర్భంగా అందెల మాట్లాడుతూ.. నాడు బీఆర్ఎస్, నేడు కాంగ్రెస్ ప్రభుత్వాలు ప్రజల పట్ల తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నాయని మండి పడ్డారు. నాలాలను, డ్రైనేజీలను ఎప్పటికప్పుడు అధికారులు క్లీన్ చేయకపోవడం వల్లనే ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు. కార్పొరేషన్ పరిధిలో ఏఏ ప్రాంతాలు, కాలనీలు ముంపునకు గురికాబడుతున్నాయో అధికారులకు తెలిసి కూడా అప్రమత్తంగా ఉండాలని సూచించకపోవడం బాధాకరమన్నారు. కార్పొరేషన్ అధికారులు ఇప్పటికైనా అప్రమత్తంగా ఉండాలని కోరారు. ముంపు కాలనీల కష్టాలు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్‌ను కోరారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు శంకర్, లక్ష్మారెడ్డి, బీజేపీ కార్పొరేషన్ అధ్యక్షుడు వీరకర్ణారెడ్డి, పార్టీ నాయకులు ఉన్నారు.

నీట మునిగిన గ్రీన్‌హోమ్స్ కాలనీ

నాదర్‌గుల్‌లోని సున్నం చెరువు నిండి అలుగు పారుతోంది. చెరువు కింద ఉన్న బడంగ్‌పేట–నాదర్‌గుల్ ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న గ్రీన్ హోమ్స్ కాలనీలోకి చెరువు నీరు, వరద చేరి కాలనీ ముంపునకు గురైంది. చెరువు అలుగును బాలాపూర్ మండల తహసీల్దార్ ఇందిరాదేవి, ఇరిగేషన్ అధికారులు, స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లల్లో గ్రీన్‌హోమ్స్ కాలనీ వెంచర్ చేయడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడింది. గత ప్రభుత్వ వైఫల్యం కారణంగా గ్రీన్‌హోమ్స్ కాలనీ వరదలకు నిలయంగా మారిందని మాజీ సర్పంచ్ మర్రి హన్మంత్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ మహేశ్వరం నియోజకవర్గం అధ్యక్షుడు సుభాన్‌యాదవ్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు ఆరోపించారు. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ల ఉన్న ఈ గ్రీన్‌హోమ్స్ కాలనీని ఫేస్‌లుగా చేసుకుంటూ సున్నం చెరువులోకి వెంచర్‌ను తీసుకుపోతున్నారని విమర్శించారు. అధికారులు స్పందించి కట్టడి చేయాలని డిమాండ్ చేశారు. కాలనీవాసులు పడుతున్న ఇబ్బందులను పరిగణలోకి తీసుకుని శాశ్వత పరిష్కారం కోసం ట్రంక్‌లైన్ వేయాలని అధికారులను కోరారు.

తల్లీకూతురు అదృశ్యం

హస్తినాపురం: భర్తతో గొడవపడి కూతురితో సహా ఓ గృహిణి అదృశ్యమైన ఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. గోనెల కళ్యాణి, గోనెల రవి దంపతులు తన రెండ్డున్నర సంవత్సరాల కూతురితో కలిసి ఆర్టీసీ కాలనీలో ఉంటున్నారు. ఈ నెల 18న ఇద్దరి నడుమ గొడవ జరిగింది. రవి పనికి వెళ్లిన తర్వాత కల్యాణి తన కుమార్తెను తీసుకుని వెళ్లిపోయింది. సాయంత్రం ఇంటికి వచ్చిన రవికు భార్య కూతురు కలిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఉల్లంఘనులకు జరిమానా

చాదర్‌ఘాట్: వినాయక నిమజ్జన సమయంలో డీజే వాడినందుకు రూ.3 లక్షల జరిమానా విధించిన ఘటన చాదర్‌ఘాట్ ఠాణా పరిధిలో చోటు చేసుకుంది. సీఐ మురారి తెలిపిన ప్రకారం.. ఆనంద్‌నగర్‌కు చెందిన ఆర్గనైజర్ నిమజ్జన సమయంలో డీజే ఉపయోగించాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు కోర్టులో హాజరు పరచగా కోర్టు రూ.3 లక్షలు జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

భారీ వర్షం

తుక్కుగూడ: మున్సిపల్ పరిధిలోని గ్రామాల్లో ఆదివారం అర్ధరాత్రి భారీ వర్షం కురిసింది. దీంతో శ్రీశైలం జాతీయ రహదారి, ఔటర్ రింగు సర్వీస్ రోడ్డు, పలు గ్రామాల రోడ్లు పూర్తిగా జలమయమయ్యాయి. తుక్కుగూడ సూరం చెరువు, రావిర్యాల చెరువులోకి భారీగా వరద నీరు చేరుతోంది.



తుక్కుగూడ: పులిందర్ వాగులో ప్రవహిస్తున్న వరద

చెత్తను ఎప్పటికప్పుడు తరలించాలి

చైతన్యపురి: రహదారులపై పేరుకుపోతున్న చెత్తను ఎప్పటికప్పుడు తరలించాలని చైతన్యపురి కార్పొరేటర్ రంగా నర్సింహగుప్తా అన్నారు. ఫణిగిరి కాలనీ, మారుతీనగర్ ఈస్ట్ కాలనీల్లో సోమవారం ఆయన పర్యటించి స్థానికులతో మాట్లాడారు. ఈ సందర్భంగా స్థానికులు పలు సమస్యలను కార్పొరేటర్ దృష్టికి తీసుకురాగా సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించేలా చొరవ తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ రత్నసాయి, వాటర్‌వర్క్స్ మేనేజర్ గిరిధర్, జవాన్ శ్రీకాంత్ పాల్గొన్నారు.



కాలనీలో పర్యటిస్తున్న రంగానర్సింహగుప్తా